# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-09-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.**

2. **తెలంగాణలో చేపడుతున్న నీటి ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కోరారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లోని రైతు బజార్ల ద్వారా కేజీ ఉల్లిపాయలను 35 రూపాయలకు విక్రయించనున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు 95 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**

==========================

ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా జాబితాను ప్రజల అభ్యంతరాల కోసం ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిందని తెలిపారు. ఓటర్ల జాబితాలో నకిలీ ఓట్లను తొలగించటమే ఎస్.ఐ.ఆర్ ముఖ్య ఉద్దేశ్యమని కేంద్రమంత్రి పేర్కొంటూ...

వాయిస్..27.. సెకన్లు

--------------------------

తెలంగాణలో చేపడుతున్న తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించేలా త్వరగా చర్యలు చేపట్టాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పలు సాగునీటి ప్రాజెక్టులపై వారు చర్చించారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలు, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు త్వరగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టు నివేదికను ఇప్పటికే సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురంమన్యం జిల్లా సీతంపేటలో జరిగిన ఐటీడీఏ 78వ పాలకవర్గ సమావేశంలో గిరిజన సంక్షేమం, అభివృద్ధిపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అమలు చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ పథకాలు, నిధులు అర్హులైన ప్రతి గిరిజనుడికి పారదర్శకంగా అందేలా చూడాలని ఆదేశించారు. సీతంపేట ఐటీడీఏ పరిధిని పసుపు పంటకు కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 11 వేల 85 కోట్ల రూపాయలను మంజూరు చేశాయని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన వీడియో సందేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ ఈ నిధుల్లో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గానికి సుమారు 44 కోట్ల రూపాయలను కేటాయించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, అత్యవసర వసతుల కల్పనకు ఈ నిధులను వినియోగించనున్నట్లు వెల్లడిస్తూ,

వాయిస్ ..27.. సెకన్లు

---------------------------

ఉల్లిపాయల ధరల పెరుగుదల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని రైతు బజార్ల ద్వారా కేజీ ఉల్లిపాయలను 35 రూపాయలకు విక్రయించనున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తొలి దశలో విజయవాడ నగరంలోని అన్ని రైతు బజార్లలో ఈరోజు నుంచి ఈ విక్రయాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆధార్ లేదా రేషన్ కార్డు ఆధారంగా ప్రతి కుటుంబానికి నెలకు రెండు కేజీల ఉల్లిపాయలను కేజీ 35 రూపాయల చొప్పున అందించనున్నామని మంత్రి వివరిస్తూ... విజయవాడలో ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే స్పందనను బట్టి రాష్ట్రంలోని ఇతర రైతు బజార్లకు కూడా విస్తరించనున్నట్లు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు కింద 95 కోట్ల రూపాయలు మంజూరైయ్యాయని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ ఈ నిధులతో హేవలాక్ బ్రిడ్జి, పుష్కర్ ఘాట్ల అభివృద్ధి వంటి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు వేల మందికి పైగా ఉపాధి లభిస్తుందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థలకు నిర్వహించనున్న ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ రోజు నుంచి ప్రాంతీయ సదస్సులు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా విశాఖపట్నంలో ఈరోజు ప్రాంతీయ సదస్సు జరగనుంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురంమన్యం, అనకాపల్లి జిల్లాల పరిధిలోని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల కమీషనర్లు,

ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పర్యవేక్షణ అధికారులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. రేపు రాజమహేంద్రవరంలో, శనివారం గుంటూరులో, సోమవారం అనంతపురంలో ప్రాంతీయ సదస్సులు నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు.

-------------------------

పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో పప్పుధాన్యాల సాగు గణనీయంగా పెరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఢిల్లీలో జరిగిన జాతీయ రబీ సదస్సులో మంత్రి నిన్న పాల్గొని.. తెలంగాణలో వ్యవసాయ రంగ ప్రగతితో పాటు రైతుల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ ఖరీఫ్‌లో గత ఏడాదితో పోలిస్తే పప్పుధాన్యాల సాగు 36 శాతం పెరిగిందని.. దీంతో తెలంగాణ దేశంలో రెండో స్థానంలో నిలిచిందని చెప్పారు. రైతులకు విత్తనాలు, ఎరువులతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, సకాలంలో రుణాలు, నేల ఆరోగ్య సమాచారం, శాస్త్రీయ సలహాలు, నీటి పొదుపు విధానాలు, మౌలిక వసతులు అవసరమని మంత్రి పేర్కొన్నారు.

-------------------------

ఉత్తర తమిళనాడు దానిని ఆనుకొని ఉన్న దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌పై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ జిల్లాలలో రానున్న మూడురోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది.

మరోవైపు తెలంగాణలో ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

-------------------------

అంతర్జాతీయ అనువాదకుల దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. ఒక భాషలోని భావాలను మరో భాష మాట్లాడే ప్రజలకు అర్థమయ్యేలా చేస్తున్న అనువాదకుల సేవలను గుర్తించేందుకు ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ప్రతి ఏటా సెప్టెంబర్ 30న ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ అనువాద పితామహుడిగా పేరొందిన సెయింట్ జెరోమ్ గౌరవార్థం ఈరోజును అనువాదకుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. గ్రీకు భాషలోని బైబిల్‌ను ఆయన లాటిన్‌లోకి అనువదించారు. వివిధ భాషల్లోని సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో అనువాదకుల పాత్రపై అవగాహన కల్పించేందుకు ఈరోజు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

=====================